సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 19 । మే । 2025



అగ్రి కోర్సులతో పచ్చని కెరీర్
ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికంటే అతి తక్కువ ఖర్చుతో సర్టిఫికెట్ కోర్సులు చేసిన వారికి త్వరగా ఉద్యోగాలు వస్తున్నాయి. 8లో



రెచ్చిపోయిన రౌడీషీటర్
హిందూపురంలో ఓ రౌడీ షీటర్ రెచ్చిపోయాడు. స్వయానా సొంత పిన్ని ఇంటిపైనే దాడికి తెగపడ్డాడు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/21.2°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు



పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కిష్టప్ప ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి నుంచి 28వ తేదీ వరకూ పరీక్షలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అర గంట ముందు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'



ప్రశాంతి నిలయం: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వవచ్చన్నారు.

ఎస్పీ కార్యాలయంలో

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఎస్పీ వి. రత్న ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలన్నారు. వివిధ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీరజవాన్ కుటుంబానికి మహారాష్ట్ర మంత్రి పరామర్శ



మురళీనాయక్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర మంత్రి సంజయ్‌రాథోడ్

గోరంట్ల: 'ఆపరేషన్ సిందూర్'లో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీనాయక్ కుటుంబ సభ్యులను మహారాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి సంజయ్‌రాథోడ్ పరామర్శించారు. ఆదివారం ఆయన కల్లి తండాకు చేరుకొని మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిని ఓదార్చారు. అనంతరం వీరజవాన్ మురళీనాయక్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం మురళీనాయక్ చేసిన ప్రాణ త్యాగం దేశ చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. మురళీనాయక్ కుటుంబం గత ఇరవై ఏళ్ల నుంచి జీవనోపాధి కోసం ముంబయ్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. మురళీనాయక్ కుటుంబానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వీరజవాన్ మురళీనాయక్ సంస్మరణ సభను కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ సింగర్ మంగ్లితో పాటు జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

రాప్తాడులో రక్తపుటేరులు

- వరుస హత్యలకు తెగబడుతున్న టీడీపీ గూండాలు
- 2015లో భూమిరెడ్డి శివప్రసాదరెడ్డి దారుణ హత్య
- 2018లో కందుకూరు శివారెడ్డిని నరికి చంపిన 'పచ్చ' నేతలు
- ఈ ఏడాది మార్చి 30న పాపిరెడ్డిపల్లిలో పరిటాల బంధువుల చేతిలో హత్యకు గురైన లింగమయ్య
- తాజాగా రాప్తాడులో దంపతులను కిరాతకంగా చంపిన 'పచ్చ' గూండాలు



అంత్యక్రియలకు తీసుకెళ్తున్న నారాయణ రెడ్డి, ముత్యాలమ్మ మృతదేహాలను చూసి రోదిస్తున్న గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం:రాప్తాడు నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాక్షన్ పడగ విప్పింది. టీడీపీ గూండాల చేతిలో ప్రత్యర్థులు దారుణ హత్యకు గురవుతున్నారు. అధికారం చేపట్టిన నాటినుంచి పరిటాల కుటుంబం సాగిస్తున్న ఈ దమన కాండకు సామాన్య, మధ్య తరగతి రైతులు బలవుతున్నారు. 2014-19 మధ్యకాలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు నేతలను దారుణంగా హత్య చేసిన పరిటాల వర్గీయులు.. 2024లో అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోశారు. రాప్తాడు నియోజకవర్గాన్ని రక్తపు మడుగులో తడిపేస్తున్నారు. 2019-24 మధ్య ప్రశాంతంగా బతికిన పల్లెలు ఇప్పుడు వేట కొడవళ్ల పదునుకు కకావికలమవుతున్నాయి. పరిటాల రవి హయాం నాటి హత్యలు మళ్లీ గుర్తుకొస్తున్నాయని సామాన్యులు భయాందోళన చెందుతున్నారు.

ఆ కుటుంబం ఎక్కడుంటే అక్కడ ఫ్యాక్షనే..

పరిటాల కుటుంబం ఎక్కడున్నా కక్షలు, హత్యలు అన్నట్టు సాగుతోంది. 2014-19 మధ్య ఎమ్మెల్యేగా గెలిచిన పరిటాల సునీత మంత్రి అయ్యారు. అప్పటికే తనయుడు శ్రీరామ్ దూకుడుగా ఉన్నారు. ఆ తరుణంలోనే వైఎస్సార్‌సీపీ నేత భూమిరెడ్డి శివప్రసాద్‌రెడ్డిని 2015 ఏప్రిల్ 29న రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలోనే టీడీపీ వర్గీయులు దారుణంగా నరికి చంపారు. నిందితులు అప్పట్లో ప్రస్తుత అనంతపురం ఎమ్మెల్యే, అప్పటి రాప్తాడు ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్ కారులో వెళ్లి శివప్రసాద్‌రెడ్డిని చంపారు. పరిటాల వర్గీయులు చేసిన ఈ హత్య అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

శివారెడ్డినీ పొట్టనపెట్టుకున్నారు..

కందుకూరు శివారెడ్డి.. ఈ పేరు వింటే ఉచిత మంచినీరు గుర్తుకొస్తుంది. రాజకీయంగా ఎదుగుతున్న ఆయన్ను చూసి ఓర్వలేక దారుణంగా చంపారు. పొలం నుంచి వస్తుండగా పరిటాల వర్గీయులు వేట కొడవళ్లతో నరికి హతమార్చారు. ఇటీవల ఈ కేసులో ఐదుగురు ముద్దాయిలకు యావజ్జీవ శిక్ష పడింది. శిక్ష పడటానికి కొన్ని రోజుల ముందు కూడా రాజీకి రావాలని బాధితులపై పరిటాల కుటుంబం ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.

లింగమయ్యను చంపిన పరిటాల బంధువులు..

తమకు వ్యతిరేకంగా పనిచేస్తే ఎవరినైనా చంపుతామనే ధోరణితో స్వయానా పరిటాల బంధువులు రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యను ఈ ఏడాది మార్చి 30న ఉగాది రోజున దారుణంగా హత్య చేశారు. 'మాకు వ్యతిరేకంగా పని చేస్తావా?! నీకు ఎంత ధైర్యం' అంటూ ఇంటిపైకి వెళ్లి మరీ లింగమయ్యను చంపారు. అంతకుముందే లింగమయ్య కొడుకుపై దాడికి తెగబడ్డారు.

తాజాగా రైతు దంపతులు..

రాప్తాడులో నివాసముంటున్న రైతు చిగిచెర్ల నారాయణరెడ్డి, భార్య ముత్యాలమ్మ శనివారం దారుణ హత్యకు గురయ్యారు. కొన్ని రోజులుగా పొలం విషయంలో నారాయణరెడ్డికి, టీడీపీ వర్గీయులకు తగాదా ఉంది. ఈ నేపథ్యంలో శనివారం పొలంలోకి వెళ్లిన నారాయణరెడ్డి, ముత్యాలమ్మను టీడీపీ వర్గీయులు వేటకొడవళ్లతో నరికి చంపారు. బాధిత కుటుంబ సభ్యులు నిందితుల పేర్లు చెప్పడానికి కూడా భయపడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అదుపుతప్పిన శాంతిభద్రతలు..

ఇటు అనంతపురం, అటు శ్రీ సత్యసాయి జిల్లాల్లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. లింగమయ్య హత్యకు ముందు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఆయన బలయ్యారు. హత్యానంతరం కూడా పోలీసులు అదే ధోరణితో వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో హెలీప్యాడ్ ఘటన విషయంలో 71 మందిపై కేసు నమోదు చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రివర్స్ కేసులు పెడుతున్నారు. తాజాగా దంపతుల హత్యతో పోలీసుల డొల్లతనం బయటపడింది. గ్రామాల్లో టీడీపీ నేతలు భయానక వాతావరణం సృష్టించి దాడులకు తెగబడుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.



తల్లిదండ్రుల మృతదేహాల వద్ద రోదిస్తున్న ప్రదీప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి



అశ్రునయనాలతో అంత్యక్రియలు

రాప్తాడు: టీడీపీ మూకల దాష్టీకానికి బలైన రైతు దంపతులు చిగిచెర్ల ముత్యాలమ్మ, చిగిచెర్ల నారాయణ రెడ్డి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వారి తోటలో మృతదేహాలను ఖననం చేశారు. సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం రాప్తాడులోని నివాసం వద్దకు ముత్యాలమ్మ, నారాయణ రెడ్డి మృతదేహాలను తీసుకురాగా.. నివాళులర్పించేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద కుమారులు ప్రదీప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారందరినీ కలచివేసింది. 'ఇక మాకు దిక్కెవరు' అంటూ కన్నీరుమున్నీరవుతున్న వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. మృతదేహాలను వారి స్వగ్రామం గొల్లపల్లి తీసుకెళ్లగా.. అక్కడా దంపతులను కడసారి చూసేందుకు గ్రామ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. అనంతరం మృతదేహాలను తోటలోకి తీసుకెళ్లి ఖననం చేశారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం



దంపతుల మృతదేహాల వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: 'కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి, మీకు ఏ సమస్య వచ్చినా మా కుటుంబం అన్ని విధాలా అండగా ఉంటుంది' అంటూ ప్రదీప్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డిలను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి ఓదార్చారు. ముత్యాలమ్మ, నారాయణ రెడ్డి మృతదేహాలకు పూలమాలలు వేసి తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. దంపతుల కుమారులను పరామర్శించారు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మృతి చెందడం బాధాకరమన్నారు. ఏ సమస్య వచ్చినా తాను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మండల మాజీ యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, గొల్లపల్లి సర్పంచు హనుమంత రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. గొల్లపల్లి గ్రామంలో చిగిచెర్ల నారాయణ రెడ్డి, ముత్యాలమ్మ మృతదేహాలకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బలం లేకున్నా బరిలోకి ..

అధికారమే అండగా టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. బలం లేకపోయినా ఎంపీపీ, వైస్ ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు మరోసారి ప్రలోభాలు, బెదిరింపులకు తెరతీశారు. సోమవారం జరగనున్న రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ, కదిరి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో దొడ్డిదారిలో పదవులు కైవసం చేసుకునేందుకు నిస్సిగ్గుగా సిద్ధమయ్యారు.

- ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న టీడీపీ
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు బెదిరింపులు, ప్రలోభాలు
- పోటీకి అభ్యర్థి లేకున్నా టీడీపీ నాయకుల కక్కుర్తి
- నేడు రామగిరి, గాండ్లపెంట ఎంపీపీ, కదిరి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు



సాక్షి, పుట్టపర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన టీడీపీ.. బెదిరింపులు, ప్రలోభాలతో పదవులు దక్కించుకోవాలని చూస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించిన అభ్యర్థులను కేసుల పేరుతో బెదిరించి.. పదవులు ఆఫర్ చేస్తూ ఫిరాయింపు రాజకీయాలకు తెరతీసింది. ఇప్పటికే మడకశిర, కదిరి మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానంలో కూటమి నేతలు నెగ్గారు. బలం లేకున్నా.. ప్రత్యర్థి పార్టీ సభ్యులను బెదిరించి.. చైర్‌పర్సన్‌లను దించేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్లకు రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినట్లు తెలుస్తోంది. ఎంతమందికి టీడీపీ పదవులు ఇస్తుందనే దానిపై స్పష్టత లేదు. ఇప్పటికే హిందూపురంలో పార్టీ ఫిరాయించిన వారిని దూరంగా పెట్టిన సంగతి తెలిసిందే.

అభ్యర్థి లేకున్నా ఎమ్మెల్యే సునీత కక్కుర్తి

రామగిరి ఎంపీపీ పదవి మహిళకు రిజర్వేషన్ చేశారు. మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. వైఎస్సార్‌సీపీ 9 చోట్ల, టీడీపీ ఒక్క చోట గెలిచాయి. ఇన్నాళ్లు ఎంపీపీగా ఉన్న మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎంపీపీ ఉప ఎన్నికల్లో గెలిచే సంఖ్యాబలంతో పాటు అభ్యర్థి కూడా టీడీపీకి లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన ఓ సభ్యురాలికి పదవి, డబ్బు ఆఫర్ చేసి బలవంతంగా పార్టీ కండువా వేసి చేర్చుకునేందుకు యత్నించారు. అయితే గంటల వ్యవధిలోనే ఆమె అసలు విషయాన్ని బహిర్గతం చేశారు. బలవంతంగా వెంకటాపురం తీసుకెళ్లి కండువా వేసి ఫొటోలు తీశారని, ఎంపీపీ పదవి కూడా ఆఫర్ చేసినట్లు తెలిపారు. అయితే తనకు టీడీపీలో చేరాల్సిన అవసరం లేదని.. అందుకే ఇంటికి దూరంగా ఉన్నట్లు ఓ వీడియో ద్వారా వెల్లడించారు. తనకు రక్షణ లేకపోవడంతో ఎంపీపీ ఉప ఎన్నికకు కూడా హాజరు కాలేననే విషయం కూడా చెప్పారు.

గాండ్లపెంటలో గందరగోళం

మొత్తం ఏడు స్థానాలకు గానూ టీడీపీ కేవలం ఒక్క సీటు మాత్రమే గెలిచింది. అయితే ఆ తర్వాత గాండ్లపెంటలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. వైఎస్సార్‌సీపీ సభ్యులను పలు విధాలుగా ఇబ్బందులకు గురి చేసి.. బెదిరింపుల ద్వారా టీడీపీలో చేర్చుకునే ప్రయత్నం చేశారు. సోమవారం జరిగే ఎంపీపీ ఉప ఎన్నికలో ఎవరు గెలుస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

కదిరిలోనూ అడ్డదారిలోనే..

కదిరిలో 36 వార్డులుండగా వైఎస్సార్‌సీపీ 30 వార్డులు కైవసం చేసుకుంది. కేవలం 5 వార్డుల్లో టీడీపీ, ఒక చోట స్వతంత్ర్య అభ్యర్థి గెలిచారు. అయితే చైర్‌పర్సన్ పదవి కోసం టీడీపీ ప్రజాస్వామ్యానికి పాతర వేసింది. వైఎస్సార్‌సీపీకి చెందిన 19 మంది కౌన్సిలర్లను ప్రలోభపెట్టింది. ఇప్పటికే అవిశ్వాస తీర్మానం పెట్టి చైర్‌పర్సన్‌ను దించేశారు.

నేడు జరగనున్న ఎన్నికల్లో పార్టీల బలాబలాలు

రామగిరిలో ఎంపీటీసీ స్థానాలు	10	గాండ్లపెంటలో ఎంపీటీసీ స్థానాలు	07
వైఎస్సార్‌సీపీ	09	వైఎస్సార్‌సీపీ	06
టీడీపీ	01	టీడీపీ	01

కదిరి మున్సిపాలిటీ	(36 వార్డులు)
వైఎస్సార్‌సీపీ	30
టీడీపీ	05
స్వతంత్ర	01

రాజకీయ భవిష్యత్తు ఉండదు



ఒక పార్టీలో గెలిచి.. మరో పార్టీకి ఫిరాయిస్తే అలాంటి వారికి రాజకీయ భవిష్యత్తు ఉండదు. ఎంతోమంది మద్దతుతో గెలిచి ప్రలోభాలకు లోనై పార్టీ మారడం సమంజసం కాదు. ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలి. చేతనైతే ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలి. ఇతర పార్టీల అభ్యర్థులను బెదిరించి టీడీపీ కండువాలు వేయడం రాజకీయం కాదు.

– ఉషశ్రీచరణ్,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు


జిల్లా వ్యాప్తంగా వర్షాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం కురవడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందగా.. ముంగారు సేద్యాన్ని సకాలంలో పూర్తి చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. జిల్లాలోని గోరంట్ల మండలంలో 97.2 మి.మీటర్లు, అమడగూరు 74.8, సీకేపల్లి 55.4, పుట్టపర్తి 46.4 , కొత్తచెరువు 42.6 , పెనుకొండ 41.4, కదిరి 38.6, ముదిగుబ్బ 36.4, ఓడీ చెరువు 35.4, తనకల్లు మండలంలో 32.2 మి.మీటర్ల వర్షం అత్యధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. అలాగే నల్లమాడ మండలంలో 28.2 మి.మీటర్లు, గుడిబండ 26.8, నల్లచెరువు 26.2, రామగిరి 23.6, సోమందేపల్లి 23.4, హిందూపురం 22.6, బుక్కపట్నం 21, చిలమత్తూరు 18.2, ఎన్‌పీ కుంట 18, రొద్దం 17, మడకశిర 16.6, రొళ్ల 15.4, లేపాక్షి 14.8, పరిగి 14.6, గాండ్లపెంట 11, అమరాపురం 9.8, అగళి 7.4, కనగానపల్లి 4.2, తాడిమర్రి 3.4, ధర్మవరం 2.4, తలుపుల 2.4, బత్తలపల్లి మండలంలో 2.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. 32 మండలాల్లో 829.6 మి.మీటర్ల వర్షపాతం కురిసిందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రశాంతి నిలయం: రానున్న వారం రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించిందని కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దూర ప్రాంతాలు ప్రయాణాలు చేయకూడదన్నారు. సోమవారం పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రాల్లోని రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలతో ఎలాంటి నష్టం జరిగిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 08555289039ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



నెట్టికంటి ఆంజనేయస్వామి

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం వేకువజామునే నెట్టికంటుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారిని తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ కే.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గోపూజను ఘనంగా నిర్వహించారు. గోమాతకు నూతన వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ యాగశాలలో 108 కలశాలను ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్చా రణల మధ్య పూజలు చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ముఖ మండపంలో నెట్టికంటి ఆంజనేయస్వామి వారి ఉత్సవ మూర్తిని కొలువు దీర్చి తులసీదళముతో లక్షార్చన నిర్వహించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల సంఖ్య పెరగడంతో ఆలయ అధికారులు ఆ మేరకు ఏర్పాట్లను చేపట్టారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్...
- ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

అనంతపురం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్-2025) సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కంప్యూటర్ ఆధారిత (ఆన్‌లైన్) విధానంలో ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ (బైపీసీ) విద్యార్థులకు ఈ నెల 19, 20 తేదీల్లో, ఇంజినీరింగ్ స్ట్రీమ్ (ఎంపీసీ)కి సంబంధించి పరీక్షలు 21 నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయి. రోజూ ఉదయం(9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు), సాయంత్రం (మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5) రెండు సెషన్లలో పరీక్షలు సాగుతాయి.

అనంతలో పరీక్ష కేంద్రాలు ఇవే:

ఎస్ఆర్ఐటీ కళాశాల(రోటరీ పురం), ఎస్వీఐటీ (హంపాపురం), అనంతలక్ష్మీ (ఇటుకలపల్లి), పీవీకేకే (రుద్రంపేట), నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చి సోషియల్ యాక్షన్ ఇండియా (చిన్మయ నగర్, ప్రసన్నాయపల్లి), గేట్స్ (గుత్తి), సీవీ రామన్ (తాడిపత్రి), తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల (తాడిపత్రి).

- విద్యార్థులు ఏపీఈఏపీసెట్ -2025 దరఖాస్తు కాపీలో పొందుపరిచిన నిర్ణీత బాక్స్‌లో కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోను అతికించి, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే రోజున సదరు కాపీతో పాటు హాల్ టికెట్ తీసుకెళ్లాలి.
- బ్లూ, బ్లాక్ కలర్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్ హాల్‌టికెట్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటీర్‌ఐడీలలో ఏదో ఒక ఒరిజినల్ తీసుకుని వెళ్లాలి. ఇవి మినహా ఇతర వస్తువులను అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీపై పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి, ఎడమ చేతి బొటనవేలి ముద్ర వేయాలి.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ...

ఏపీ ఈఏపీసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7.30 నుంచి 9.00 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.00 గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష జరిగే రోజున కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీతో పాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిమిషంలో హడావుడి లేకుండా చూసుకోవాలి.

జాతీయ జెండాకు అవమానం



కదిరి టౌన్: భారత్ – పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు శ్రద్ధాంజలి ఘటించే విధంగా కదిరి పట్టణంలోని జీవిమాను సర్కిల్‌లో హోర్డింగ్ ఏర్పాటు చేశారు. అయితే జాతీయ జెండా రంగులు మార్చి తలకిందులుగా ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. కదిరి మున్సిపల్ అధికారుల నిర్వాకంతో జాతీయ జెండాకు అవమానం జరగడం బాధాకరమంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి హోర్డింగ్ మార్చాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎడ్లబండి పోటీల విజేతగా మద్దెలచెరువు వృషభాలు



గెలుపొందిన ఎద్దులతో రైతు అంజనప్ప, గ్రామస్తులు

కనగానపల్లి: కర్ణాటకలోని విజయనగర జిల్లా కుడ్లిగి గ్రామంలో రెండు రోజులుగా సాగిన అంతర్రాష్ట్ర ఎడ్లబండి పరుగు పోటీల్లో కనగానపల్లి మండలం మద్దెలచెరువుకు చెందిన రైతు కురాకులపల్లి అంజినప్ప ఎద్దులు మొదటి బహుమతిని గెలుచుకున్నాయి. పోటీల్లో మొత్తం 25 జతల ఎద్దులు పాల్గొనగా అంజినప్ప ఎద్దుల వేగం ముందు అన్నీ వెనుకబడ్డాయి. దీంతో ప్రథమ స్థానంలో నిలిచిన మద్దెలచెరువు ఎద్దులను అభినందిస్తూ రైతు అంజనప్పకు రూ.లక్ష పురస్కారాన్ని, విజేత ట్రోఫీని నిర్వాహకులు అందజేసి సత్కరించారు. అనంతరం ఎద్దులను ప్రత్యేక వాహనంలో ఆదివారం స్వగ్రామానికి రైతు తీసుకురాగా... వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా ఊరేగించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం: స్థానిక లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోని కురుబ కల్యాణమ మంటపం వెనుక ఉన్న పట్టాలపై ఆదివారం రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తెలుపు, నలుపు కలబోసిన తల వెంట్రుకలు, పాచి కలర్ చెక్స్ డిజైన్ హాఫ్ షర్ట్, వైట్ కట్ బనియన్, బ్లూ ప్యాంటు, రెడీమేడ్ ఫుల్ డ్రాయర్ వేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా - పలువురికి గాయాలు



బోల్తా పడిన ఆటో

రాప్తాడు: ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా మామిళ్లపల్లి వైపు నుంచి అనంతపురానికి ప్రయాణికులతో బయలుదేరిన ఆటో మరూరు టోల్ ప్లాజా వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి బోల్తా పడింది. ఘటనలో గాయపడిన 8 మంది ప్రయాణికులను 108 అంబులెన్స్‌లో సర్వజనాస్పత్రికి తరలించారు.

అగ్రి కోర్సులతో పచ్చని కెరీర్

- తక్కువ ఫీజులకే కోర్సులు
- త్వరలో అగ్రి పాలిటెక్నికల్ కోర్సులకు నోటిఫికేషన్

టెన్త్ తర్వాత ఇంటర్.. అది పూర్తికాగానే ఇంజనీరింగ్ లేదా మెడిసిన్... మనలో చాలా మంది ఆలోచన ఇదే. అయితే ప్రస్తుత మార్కెట్ అవసరాల దృష్ట్యా సర్టిఫికెట్ కోర్సులకూ భారీగా డిమాండ్ నెలకొంది. పది, ఇంటర్ తర్వాత పలు సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేస్తే తక్కువ సమయంలోనే ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. ఇలాంటి కోర్సుల్లో అగ్రికల్చర్ కోర్సులు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి.



రెడ్డిపల్లిలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల



బుక్కరాయసముద్రం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రూ.లక్షల్లో ఖర్చు పెట్టి ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారి కంటే అతి తక్కువ ఖర్చుతో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసిన వారు తొందరగా ఉద్యోగాలు దక్కించుకుని జీవితంలో స్థిరపడుతున్నారు. అలాంటి సర్టిఫికెట్ కోర్సుల్లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులు ముందు వరుసలో నిలుస్తున్నాయి. వ్యవసాయాధిరిత అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఖర్చుతో మంచి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2 ఏళ్ల కోర్సు పూర్తి చేస్తే ఎంత లేదన్నా.. మరో 2 ఏళ్లలో ఉద్యోగం గ్యారంటీ అనే నమ్మకం ఇప్పటికే ప్రజల్లో పాతుకుపోవడంతో రోజురోజుకూ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, కళ్యాణదుర్గం కేవీకేలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు అనంతపురం, కదిరి, తాడిపత్రిలో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

కావలసిన విద్యార్హతలు..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు పెద్దగా విద్యార్హతలతో పని లేదు. ప్రధానంగా పదో తరగతి ఉత్తీర్ణులై ఉంటే చాలు. ఆసక్తి ఉన్న వారు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ఈ నెలాఖరులోపు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దరఖాస్తు చేయడానికి, మరింత సమాచారానికి https:// angrau.ac.in/ వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సి ఉంటుంది.

సీట్ల కేటాయింపు, ఫీజులు ఇలా..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు నిబంధనలు వర్తిస్తాయి. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బాలికలకు 33 శాతం సీట్లు, అంగవైకల్యం కలిగిన వారికి 3 శాతం సీట్లు కేటాయించారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశ అర్హత దక్కిన వారు ఏడాదికి రూ.8,800 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హాస్టల్ వసతి కావాలనుకునేవారు రూ.11వేలు డిపాజిట్ చేయాలి. కోర్సు పూర్తి అయిన తర్వాత డిపాజిట్ సొమ్మును వెనక్కు చెల్లిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో అయితే రూ.29 వేలు ఫీజు, హాస్టల్‌కు రూ.5,500 చెల్లించాలి. కళాశాలలో చేరే విద్యార్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంను పూరించి జనరల్ విద్యార్థులు అయితే రూ.500, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులైతే రూ.250 డీడీ తీసి అందజేయాలి.

అగ్రికల్చర్ కోర్సులు ఇవే

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల నుంచి మూడేళ్ల కాల వ్యవధి ఉన్న పలు కోర్సులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా..

కోర్సు	కాల వ్యవధి
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్	3 ఏళ్లు
డిప్లొమా ఇన్ హోంసైన్స్	3 ఏళ్లు

ఉజ్వల భవిష్యత్తు



అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. ఈ కోర్సులు అభ్యసిస్తే సత్వరమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి గాను త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందజేయాలి. ఉజ్వల భవిష్యత్తు ఉన్న అగ్రి కోర్సులు పూర్తి చేసిన వారు ఆధునాతన వ్యవసాయం, డెయిరీ ఫాం, పాడి, ఎరువుల కంపెనీలు, వ్యాపారం వంటి రంగాలను ఎంచుకుని జీవితంలో స్థిరపడవచ్చు.

– డాక్టర్ వసుంధర, ప్రిన్సిపాల్, రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరం



ఉన్నత చదువులకు సాయం చేయాలని కోరుతున్న విద్యార్థి మౌనిక (చిత్రంలో) తల్లి కళావతి

రొద్దం: ఇటీవల పదో తరగతిలో 520 మార్కులు సాధించిన ఓ విద్యార్థిని ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేక మదనపడుతోంది. వివరాలు... రొద్దం గ్రామానికి చెందిన కళావతి, శ్రీనివాసులు దంపతుల కుమార్తె మౌనిక ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 520 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కొంత కాలం క్రితం అనారోగ్యంతో తండ్రి శ్రీనివాసులు మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లినే కూలి పనులతో కుమార్తెను చదివిస్తూ వస్తోంది. ఈ క్రమంలో ఉన్నత శ్రేణి మార్కులతో కుమార్తె పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించడంతో ఎంతో సంబరపడిన ఆమె... ఆ తర్వాత ఉన్నత చదువులకయ్యే ఖర్చును తలుచుకుని ఆ డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక మదనపడుతోంది. తల్లి కష్టాన్ని చూడలేక... తన చదువులు ఇక్కడితో ఆపేసి కూలి పనులకు తానూ వస్తానంటూ కుమార్తె మౌనిక తెలపడంతో తల్లి కంట కన్నీరు ఆగడం లేదు. దీంతో ఎవరైనా దాతలు సహకరించి తన చదువులకు సాయం చేయాలని మెరిట్ విద్యార్థిని వేడుకుంటోంది.

మచ్చుకత్తులతో గొంతుకోసి..

- రాయదుర్గంలో యువకుడి హత్య

రాయదుర్గం: మండలంలోని కొంతానపల్లికి చెందిన టైలర్ వినోద్‌కుమార్ (22) దారుణ హత్యకు గురయ్యాడు. మచ్చుకత్తులతో గొంతు కోయడంతో శరీరం నుంచి తల వేరుపడింది. పోలీసులు తెలిపిన మేరకు... కొంతానపల్లికి చెందిన ఆంజనేయులు, అంజినమ్మ దంపతుల ఏకైక కుమారుడు వినోద్‌కుమార్ టైలర్ వృత్తితో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. స్వగ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో జీవనోపాధి పొందుతున్న వినోద్‌కుమార్... ఇటీవల ఊరిదేవర సమయంలో గ్రామానికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి ఇంటి పట్టునే ఉంటూ ఇక్కడే టైలర్ వృత్తిని కొనసాగిస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో రాయదుర్గంలోని ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవంలో పాల్గొనేందుకు శనివారం వచ్చాడు. ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. ఆదివారం తెల్లవారుజామున కొంతానపల్లి గేట్ వద్ద చింతమాను వద్ద వినోద్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయనాయక్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మచ్చుకత్తితో గొంతు కోసి హతమార్చినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోయిన రౌడీ షీటర్

- సొంత పిన్ని ఇంటిపై దాడి
- రూ.2 లక్షలకు పైగా నష్టం



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన లలితమ్మ

లేపాక్షి: హిందూపురానికి చెందిన ఓ రౌడీ షీటర్ రెచ్చిపోయాడు. స్వయానా సొంత పిన్ని ఇంటిపై దాడికి తెగబడి మారణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితురాలు తెలిపిన మేరకు... హిందూపురంలోని బోయపేటలో నివాసముంటున్న ప్రవీణకు లేపాక్షి మండలం పి.సడ్లపల్లి గ్రామానికి చెందిన లలితమ్మ సొంత అక్క. ప్రవీణ కుమారుడు దినేష్ నేరప్రవృత్తి కలిగి ఉండడంతో అతనిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. ఈ క్రమంలో మరింత రెచ్చిపోతూ వచ్చాడు. ఈ క్రమంలోనే తన పిన్ని లలితమ్మ కుమారుడు జగదీష్‌తో దినేష్‌కు గొడవలు నెలకొన్నాయి. ఈ కలహాలు తారస్థాయికి చేరుకోవడంతో శనివారం రాత్రి దినేష్ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని సడ్లపల్లికి వెళ్లి పిన్నితో తాడోపేడో తేల్చుకుని వస్తానంటూ బయలుదేరాడు. ఇదే విషయాన్ని ప్రవీణ వెంటనే తన అక్కకు ఫోన్ చేసి తెలిపింది. దీంతో లలితమ్మ వెంటనే ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి పొలాల్లోకి వెళ్లిపోయారు. ఈ లోపు తన అనుచరులతో కలసి అక్కడకు చేరుకున్న దినేష్ మారణాయుధాలతో తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించాడు. ప్రతి సామగ్రిని ధ్వంసం చేసి వెళ్లిపోయాడు. అప్పటికే చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లలితమ్మ, ఆమె కుటుంబసభ్యులను పిలిపించి ఇంటి పరిస్థితిని సమీక్షించారు. లలితమ్మ మాట్లాడుతూ.. తన ఇంట్లో దాచిన నగలతో పాటు నగదునూ తీసుకుపోయారని ఆవేదన వ్యక్తం చేసారు. దాడిలో రూ.2 లక్షలకు పైగా నష్టపోయినట్లు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనపై ఎస్‌ఐ నరేంద్ర మాట్లాడుతూ.. దాడికి కారణమైన దినేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతనికి సహకరించిన వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పురాతన శాసనం గుర్తింపు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో వెలసిన సజ్జగంట రంగనాథస్వామి ఆలయంలో 1221 నాటి పురాతన శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి గుర్తించారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన హొయసల కాలంలో మూడో వీరబల్లాలుడు సజ్జగంట రంగనాథస్వామి ఆలయాన్ని నిర్మించినట్లుగా శాసనంలో ఉందన్నారు. ఈ ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ చర్యలు చేపట్టాలని కోరారు.

తడుస్తూనే బస్సులో ప్రయాణం!

- హిందూపురం డిపో ఎదుట ప్రయాణికుల ఆందోళన



హిందూపురం ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

హిందూపురం: స్థానిక ఆర్టీసీ డిపో అధికారుల నిర్వాకం కారణంగా రాత్రంతా బస్సులోనే తడుస్తూ ప్రయాణించాల్సి వచ్చిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు... తిరుపతి నుంచి హిందూపురానికి శనివారం రాత్రి బయలుదేరిన ఆర్టీసీ బస్సు మదనపల్లి సమీపంలోకి చేరుకోగానే భారీ వర్షం మొదలైంది. గ్లాసు కిటికీలుసరిగా లేని కారణంగా వర్షం నీరంతా బస్సులోకి చేరుకుంది. ప్రయాణికులు తడిసి ముద్దయ్యారు. వరదను తలపించేరీతిలో బస్సులోకి నీరు చేరుకోవడంతో తమ లగేజీని తీసి ఒళ్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వచ్చింది. బస్సు కదిరికి చేరుకోగానే ప్రయాణికులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటికప్పుడు మరో బస్సును ఏర్పాటు చేసి ప్రయాణికులను హిందూపురానికి చేర్చారు. ఆదివారం ఉదయం హిందూపురం బస్టాండ్‌కు చేరుకోగానే ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో డిపో మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. రాత్రంతా ఇబ్బందులతో ప్రయాణం చేశామని, అనుకున్న సమయం కంటే చాలా ఆలస్యంగా చేరుకోవడంతో తమకు జరిగిన నష్టాన్ని వివరించబోతే నిర్లక్ష్యంగా సీఎంకి చెప్పుకో పోండి అంటూ డీఎం హేళనగా మాట్లాడడం సరికాదంటూ మండిపడ్డారు. ప్రయాణికులను కించపరుస్తూ మాట్లాడిన ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విత్తన కేటాయింపులో కోత తగదు



విలేకరులతో మాట్లాడుతున్న ఓ.నల్లప్ప

అనంతపురం అర్బన్: జిల్లాలో ఖరీఫ్ కింద అత్యధికంగా సాగులోకి వచ్చే వేరుశనగ పంటను ప్రభుత్వం తక్కువగా అంచనా వేసి సబ్సిడీ విత్తన వేరుశనగ కేటాయింపులో కోతలు విధించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. కేటాయింపు పెంచి 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవనల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ విత్తన కాయ గత ఏడాది 76,710 క్వింటాళ్లు కేటాయించి, ప్రస్తుత ఖరీఫ్‌కు 54,184 క్వింటాళ్లు కేటాయించడంతో రైతులు ఆందోళనకు గువుతున్నారన్నారు. ప్రభుత్వం విత్తన కేటాయింపులు పెంచి జిల్లాలో కరువు పరిస్థితులు దృష్ట్యా 90 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయ పంపిణీ చేయాలన్నారు. అలాగే కందులు, ఉలవ, ఇతర ప్రత్యామ్నాయ విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఒకేసారి ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

● అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చిలమత్తూరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1975 –76 విద్యాసంవత్సరంలో కలసి పదో తరగతి చదువుకున్న వారు 50 ఏళ్ల తర్వాత అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. నాటి అల్లరి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. సహపంక్తి భోజనాలతో సందడి చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓలు కలీముల్లా, అరీవుల్లా, బుచ్చిరెడ్డి, మల్లిరెడ్డి, వారి సహ విద్యార్థులు పాల్గొన్నారు.


'కేఎస్ఎన్' కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చేరాలనుకునే విద్యార్థినులకు ఇదొక మంచి అవకాశం అన్నారు. నాలుగు ఎకరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కళాశాల భవనం ఉందన్నారు. ప్రతి తరగతి గదితో పాటు ఆవరణలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. 2022 ఏప్రిల్ 'ఏ'గ్రేడ్ గుర్తింపు పొందిందన్నారు. హాస్టల్ వసతి ఉందన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. యోగా, పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. నూతన విద్యా విధానం అమలులో భాగంగా మేజర్, మైనర్ కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థినులు నేరుగా కళాశాలలోని హెల్ప్‌డెస్క్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. పూర్తి వివరాలకు 94404 18274, 94415 52643, 93980 30817 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోర్సుల వివరాలు ఇలా...	
బీఏ	హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్‌సైన్స్.
బీకామ్	జనరల్, బీబీఏ, కంప్యూటర్ అప్లికేషన్
బీఎస్సీ	మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, మైక్రో బయాలజీ, ఎలక్ట్రానిక్స్, జర్నలిజం, పారామెడికల్ టెక్నాలజీ

ఆర్టీటీని కాపాడుకుందాం

- ప్రముఖ నేపథ్యగాయని మంగ్లీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మంగ్లీ, తదితరులు

అనంతపురం కల్చరల్: ఎందరో నిరుపేదల్లో దాగి ఉన్న కళను వెలికి తీసి సమాజానికి పరిచయం చేసిన ఆర్డీటీని కాపాడుకుంటామని ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ అన్నారు. ఆదివారం రాత్రి అనంతపురంలోని లలితకళాపరిషత్తు వేదికగా ఆర్డీటీ పూర్వవిద్యార్థులు, జానపద కళాకారులైన 'వి స్టాండ్ ఫర్ ఆర్డీటీ' పేరిట జానపద, శాస్త్రీయ సంగీత విభావరి నిర్వహించారు. శాస్త్రీయ నృత్యాలు, సంగీతం, మృదంగం, ఘటం, వీణ, తబల, వోకల్ తదితర విభాగాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, ఇందుకు ఆర్డీటీ ఇచ్చిన ప్రోత్సాహమే కారణమంటూ నినదించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంగ్లీ మాట్లాడుతూ.. ఆర్డీటీ ద్వారా తాను ఎదిగిన తీరును వివరించారు. కష్టాల్లో ఉన్న మాతృ సంస్థకు అండగా నిలిచేందుకు ప్రతి కళాకారుడూ ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది గాజుల పద్మజ ఆర్డీటీ ప్రాముఖ్యతను వివరించారు. ఆర్డీటీ ద్వారా లబ్ధి పొంది వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన సరిగమప కార్యక్రమ విజేత రేణుకుమార్, మంజునాథ్, శ్యామ్‌సన్, నారాయణస్వామి, సునీత, తిరుపతి, హైదరాబాదు, మంత్రాలయం, ఆదోని, ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.